మోదీ-బాబు డ్రామాలో తెలంగాణ జలహక్కులు హుళక్కే!

- ఒప్పందంలో ఛత్తీస్‌గఢ్‌కు 1.5 టీఎంసీలు, ఒడిశాకు 5 టీఎంసీల లిఫ్టుకు అనుమతి
- ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినందున తెలంగాణకు ఎత్తిపోసుకునే హక్కు
- ముంపు అధ్యయనాన్ని తేల్చకుండా మన రాష్ట్రంపై కేంద్ర సర్కారు వివక్ష
- కృష్ణాలో బచావత్ ఇచ్చిన 45 టీఎంసీలపై సంపూర్ణ హక్కులు
- కీలక సమయంలో ప్రేక్షకపాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

సమస్యలను చర్చించకుండానే నీటి నిల్వకు కేంద్రం-ఏపీ కుట్రలు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 30 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు సర్కారు కలిసి బనకచర్ల డ్రామాలో తెలంగాణను నిండా ముంచేందుకు మరిన్ని కుట్ర వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రాణహిత జలాలను తన్నుకుపోవడంతోపాటు తెలంగాణ హక్కులను కాలరాసేందుకు పోలవరంపై దాగుడుమూతలు ఆడుతున్నాయి. పోలవరం ప్రాజెక్టుపై జరిగిన చారిత్రక ఒప్పందాల్లో భాగంగా మన రాష్ట్రానికి దాఖలు పడాల్సిన హక్కులను నెరవేర్చకుండా... కీలకమైన ముంపు సమస్యలను తీర్చకుండానే నీటిని నిల్వ చేసేందుకు గుట్టుగా పావులు కదుపుతున్నాయి. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం కృష్ణాలో ఎగువ రాష్ట్రాల హక్కులను నెరవేర్చిన కేంద్రం... ముంపు వ్యవహారంలో ఫోర్‌షోర్ రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సమస్యలను పరిష్కరించేందుకు ఆసక్తి చూపుతున్నది. కానీ, తెలంగాణ కూడా ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందనే వాస్తవాన్ని అటు కేంద్రం, ఇటు ఆంధ్రప్రదేశ్ విస్మరిస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సైతం తెల్లారింది మొదలు బీఆర్ఎస్‌ను రాజకీయంగా బద్నాం చేయడంపైనే దృష్టిసారిస్తుందేగానీ పోలవరంలో నీటిని నిల్వ చేసే ముందు రాష్ట్రానికి రావాల్సిన న్యాయపరమైన వాటాలు, ముంపు సమస్యల పరిష్కారాలపై మాత్రం గళం విప్పడం లేదు. దీన్ని అలుసుగా తీసుకొనే తొలుత పోలవరం... ఆపై బనకచర్లను ఒడ్డున పడేసేందుకు చంద్రబాబు చక్రం తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల తాను కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకించలేదంటూ అబద్ధాలాడిన చంద్రబాబు తెలంగాణ హక్కులను ఏమేరకు అమలుచేస్తారో చెప్పాలని తెలంగాణ వాదులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టిన ఉమ్మడి పాలకులు

ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సమైక్య పాలకులు చివరకు తెలంగాణ ప్రయోజనాలను సైతం పణంగా పెట్టారు. ప్రధానంగా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లించడంతోపాటు పూర్తిస్థాయి నీటి నిల్వ స్థాయి (ఎఫ్ఆర్ఎల్)ని 150 అడుగులుగా నిర్ధారించేందుకు సంబంధిత రాష్ట్రాలను సంతృప్తిపరిచేందుకు ఆయా రాష్ట్రాలకు అనేక ప్రయోజనాలను కల్పించారు. ఆ మేరకు బచావత్ ట్రిబ్యునల్‌లో, పోలవరంపై 2.4.1980న కుదిరిన ఒప్పందంలో వాటిని పొందుపరిచారు. కానీ, అప్పటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉన్నందున తెలంగాణ ప్రాంతం అటు కృష్ణాలో వాటాపరంగా హక్కును సాధించలేకపోవడం, ఇటు గోదావరిలో ముంపుపరంగా ప్రశ్నించే పరిస్థితులు లేకుండాపోయాయి. చివరకు రాష్ట్ర విభజనను అడ్డుపెట్టుకొని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో భాగంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించింది. తదనంతరం వచ్చిన మోదీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టు నిర్మాణంతోపాటు సమస్యల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు అండగా నిలుస్తూ, తెలంగాణను విస్మరిస్తూ వస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లపాటు హక్కులు, సమస్యల పరిష్కారంపై గళం వినిపిస్తూ, కేంద్రం మీద కూడా ఎప్పటికప్పుడు ఒత్తిడి తెచ్చినా మోదీ ప్రభుత్వం దాటవేస్తూ వచ్చింది. తెలంగాణ బీజేపీ నేతలు చివరకు కేంద్ర మంత్రి, ఎంపీ పదవుల్లో ఉన్నా ఏ ఒక్కనాడూ వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ క్రమంలోనే ఎన్నాళ్లుగానో గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై తహతహలాడుతున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం.. వచ్చే ఏడాది తమిళనాట అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఆ ప్రక్రియను వేగవంతం చేసింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో మేడిగడ్డను ఎండబెట్టడం, ఏపీలో చంద్రబాబు తోడవడంతో బనకచర్లను తెరపైకి తెచ్చారు. చంద్రబాబు బనకచర్లకు ప్రాణహితను తరలించాలన్నా.. మోదీ కావేరికి గోదావరిని తన్నుకుపోవాలన్నా ముందుగా పోలవరం ప్రాజెక్టులో నిల్వ అనేది కీలకం. అందుకే పోలవరం ముంపు సమస్యల చిక్కుముళ్లను విప్పేందుకు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగేందుకు సిద్ధమయ్యారు.

పోలవరంపై ఇదే కీలక సమయం

పోలవరంలో నీటి నిల్వకు ఏపీ ఉపక్రమిస్తున్నందున ఆ ప్రాజెక్టుతో ముడిపడి ఉన్న తెలంగాణ అంశాలను వెంటనే తేల్చుకోవాలని నిపుణులు చెప్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ మేరకు పోరాడినా... ఇప్పుడు అనువైన, కీలక సమయం వచ్చినందున వాటిని నెరవేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుబట్టాలని, లేనిపక్షంలో అంగీకరించవద్దని సూచిస్తున్నారు.

అంశం-1: ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణకు హక్కు

పోలవరం ప్రాజెక్టు ఒప్పంద సమయంలోనే ముంపునకు గురవుతున్న మధ్యప్రదేశ్ (ఇప్పటి ఛత్తీస్‌గఢ్), ఒడిశా రాష్ట్రాలకు ఊరట కల్పించేందుకు ఫోర్‌షోర్ నీటి హక్కు కల్పించారు. పోలవరంలో నీటి నిల్వ వల్ల ఆయా రాష్ట్రాల్లోని భూములు మునుగుతాయి. దీంతో ఆయా రాష్ట్రాలను సంతృప్తిపరిచేందుకు ఫోర్‌షోర్ నుంచి ఛత్తీస్‌గఢ్ 1.5 టీఎంసీలు, ఒడిశా 5 టీఎంసీలు లిఫ్టు చేసుకునేందుకు హక్కు కల్పించారు.

ఆ నీటిని ఆయా రాష్ట్రాలు ఎక్కడికైనా తరలించుకోవచ్చు. అయితే, ఒప్పంద సమయంలో తెలంగాణ అనేది ఏపీలో అంతర్భాగం. కానీ, ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రం. పైగా తెలంగాణకూ ముంపు సమస్య ఉన్నది. అందుకే ప్రత్యేక రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశాతోపాటు తెలంగాణకూ సమాన హక్కులు దక్కాలి. ఈ క్రమంలో కచ్చితంగా ఫోర్‌షోర్‌లో తెలంగాణ కనీసంగా 10 టీఎంసీలనైనా నీటిని లిఫ్టు చేసుకునే హక్కు కల్పించాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్రం, ఏపీ ఇందుకు అంగీకరిస్తే ట్రిబ్యునల్ ఆమోదం లాంఛనమే అనేందుకు గోదావరి ట్రిబ్యునల్ పెద్ద ఉదాహరణ.

అంశం-2: ఎగువన ఉన్నందుకు 45 టీఎంసీలు న్యాయమే

కృష్ణా, గోదావరి ట్రిబ్యునళ్లకు చైర్మన్‌గా బచావత్ వ్యవహరించారు. ఈ క్రమంలో పోలవరంలో భాగంగా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడంపై జరిగిన వాదనల ఫలితంగా కర్ణాటక, మహారాష్ట్రను సంతృప్తిపరిచేందుకు ఒక క్లాజ్‌ను రూపొందించారు. పోలవరం ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తున్నందున ఆ మేరకు కృష్ణాజలాల్లో కృష్ణా డెల్టాకు ఎగువన ఉన్న రాష్ట్రాలకు 80 టీఎంసీల హక్కును కల్పించాలని నిర్ణయించారు. ఎగువన ఉమ్మడి ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ఉన్నందున ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీలు, కర్ణాటకకు 21, మహారాష్ట్రకు 14 టీఎంసీల చొప్పున హక్కు కల్పించారు. పోలవరం ప్రాజెక్టు పనులు మొదలైన వెంటనే ఈ హక్కులు దఖలుపడతాయని బచావత్ ట్రిబ్యునల్‌లో పొందుపరిచారు. అయితే, ఆ సమయంలో తెలంగాణ ఉమ్మడి ఏపీలో ఉన్నది. పోలవరం ద్వారా ఏపీకి ప్రయోజనం.. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన దరిమిలా న్యాయబద్ధంగా 45 టీఎంసీలు తెలంగాణకు దక్కాలి.

అంశం-3: తెలంగాణ సమస్యలను పరిష్కరించడం కేంద్రం కర్తవ్యం

బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం 36 లక్షల క్యూసెక్కుల వరదకు సంబంధించి మాత్రమే పోలవరం ఎగువన ఉన్న ప్రాదేశిక ప్రాంతాల్లో బ్యాక్ వాటర్ ప్రభావంపై అధ్యయనాన్ని సీడబ్ల్యూసీ చేయించింది. అప్పుడు డ్యామ్ డిశ్చార్జి స్థాయిని 140 అడుగుల (42.67 మీటర్లు) నుంచి 135.05 అడుగులు (41.15 మీటర్లు)గా నిర్ధారించింది. ప్రస్తుతం ప్రాజెక్టు సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు డిజైన్ చేసింది. వరద డిశ్చార్జి స్థాయిని కూడా 140 అడుగులు కాకుండా 148.5 అడుగుల (45.26 మీ)గా నిర్ధారించింది. దానివల్ల ముంపు మరింత పెరగనున్నది. ఏదైనా ప్రాజెక్టుకు స్పిల్‌వే డిజైన్ మార్పు జరిగినప్పుడు మరోసారి అందుకు సంబంధించి బ్యాక్ వాటర్ ప్రభావం అంచనాకు అధ్యయనం చేయడం తప్పనిసరి. ఆల్మట్టి ఆనకట్టకు సంబంధించి మహారాష్ట్ర భూభాగంలో ప్రభావాన్ని అంచనా వేసేందుకు అధ్యయనం చేసి, ఎలాంటి ప్రభావం ఉండబోదని నిర్ధారించుకున్న తర్వాతే మహారాష్ట్ర ఆ ప్రాజెక్టుకు సమ్మతి తెలిపింది. అదేరీతిన పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపైనా అధ్యయనం చేయించడమనేది కేంద్రం-ఏపీ కనీస కర్తవ్యం. ఆ మేరకు వచ్చే సమస్యల్ని పరిష్కరించాలి.

- పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే, కాఫర్ డ్యామ్ వద్ద +127.2 అడుగుల (+38.76మీ) నీటి నిల్వ ఉండటం వల్ల 2022 జూలైలో కేవలం 24.22 లక్షల క్యూసెక్కుల వరదకే గోదావరి 71.3 మీటర్ల ఎత్తున ప్రవహించింది. గతంలో కంటే ఇది తక్కువ వరద అయినప్పటికీ విధ్వంసం ఎక్కువగా ఉందంటే 150 అడుగుల ఎఫ్ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్) వద్ద పరిస్థితి ఏమిటనేది ఊహించలేనిది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 954 ఎకరాలు నీటమునుగుతాయి. స్థానిక డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోతుంది. భద్రాచలం, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్, అమ్మగారిపల్లి, ఆమేడ, చింత్రియాల మునిగిపోతాయి. తీవ్రత ఇంకా ఎలా ఉంటుందనే దానిపై శాస్త్రీయ అధ్యయనం జరగాలి.
- ట్రిబ్యునల్ అవార్డు క్లాజ్- 6 ప్రకారం ప్రాజెక్టును ప్రతిపాదించినవారే అన్ని రక్షణ చర్యలను (సీడబ్ల్యూసీ సూచించినవి సహా) చేపట్టాలి. అందుకోసం రీచ్ వారీగా భూ వాస్తవికతలతో సంబంధిత వరద స్థాయిలను అధ్యయనం చేయడం అత్యంత ముఖ్యం. తెలంగాణ తాను స్వయంగా చేయించుకున్న అధ్యయనంలో భద్రాచలం నుంచి ఏటూరినాగారం వరకు వరద రక్షణ చర్యలు చేపట్టేందుకు రూ.4 వేల వ్యయం అవుతుందని అంచనా వేశారు. దీని ప్రకారమే ఏపీ చర్యలు చేపట్టడమో, కేంద్రం ప్రత్యేకంగా అధ్యయనం చేయించడమో, ఏపీ-తెలంగాణ సంయుక్త సర్వేకు ఆదేశించడమో చేసి ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ రక్షణ చర్యల్ని చేపట్టాలి. ప్రధానంగా 1980 ఒప్పందంలో ఒడిశా, మధ్యప్రదేశ్ (ఛత్తీస్‌గఢ్) పరిధుల్లో ప్రాజెక్టు నిర్మించే రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రక్షణ చర్యలు చేపట్టేందుకు అంగీకరించింది. ఇప్పుడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఉన్నందున ఆ మేరకు ఏపీనే ఇక్కడ కూడా చర్యలు చేపట్టాలి.

హిమాచల్ ప్రాజెక్టులపై ఉబలాటమేల?

> మొదటిపేజీ తరువాయి...

బయటపెడతామని ఎక్స్ వేదికగా తెలిపారు. 'కూట్లో రాయి తీయనివాడు ఏట్లో రాయి తీసినట్టు'గా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు. ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడం చేతకాని అసమర్థ రేవంత్ సర్కార్.. హిమాచల్ ప్రదేశ్‌లో హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మించాలనుకోవడం శోచనీయమన్నారు.

తెల్ల ఏనుగులాంటి ప్రాజెక్టుకు రూ. 6,200 కోట్లా?

తమను ఎవరూ నమ్మడం లేదని, ఎక్కడా అప్పు పుట్టడం లేదని ప్రతి వేదికపైనా తన చేతకానితనాన్ని ప్రదర్శిస్తున్న రేవంత్‌రెడ్డి హిమాచల్ ప్రదేశ్‌లో తెల్ల ఏనుగులాంటి హైడల్ ప్రాజెక్టును రూ. 6,200 కోట్లతో నిర్మిస్తామనడం తుగ్లక్ చర్య తప్ప మరోటి కాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల నుంచి మోసర్‌బేర్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ పారిపోయినా, ఎన్టీపీసీ లాంటి కేంద్ర ప్రభుత్వ కంపెనీ మూడేండ్ల తర్వాత సాధ్యం కాదని వదిలేసిన 510 మెగావాట్ల ప్లాంట్‌ని నిర్మించేందుకు టీజీజెన్‌కో ఎందుకు ఒప్పందం చేసుకున్నదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలుగా ముందుకు సాగని ప్రాజెక్టును ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుండటంపై హరీశ్‌రావు అనుమానం వ్యక్తంచేశారు. డీపీఆర్‌లు లేకుండా, హిమాచల్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకొని, అప్‌ఫ్రంట్ ప్రీమియం కింద రూ. 26 కోట్లు చెల్లించి, మరో రూ.26 కోట్లు చెల్లించేందుకు సిద్ధపడటాన్ని బట్టి చూస్తే ప్రభుత్వం దివాలా తీసిందన్న రేవంత్ మాటలు ప్రజల్లో పూలు పెట్టడానికేనని అర్థమవుతున్నదని పేర్కొన్నారు.

సాంకేతికంగా నిర్మాణం సాధ్యం కాదన్న మోసర్‌బేర్

మోసర్‌బేర్ కంపెనీ 2009లో రూ. 64 కోట్ల అప్ ఫ్రంట్ ప్రీమియం చెల్లించి హిమాచల్ ప్రదేశ్‌లోని సేలి, మియార్‌లో హైడో పవర్ ప్రాజెక్టులు కట్టాలని భావించిందని హరీశ్‌రావు తెలిపారు. అయితే, సాంకేతికంగా ప్రాజెక్టు నిర్మాణం సాధ్యం కాదని ప్రభుత్వంతో ఒప్పందం రద్దు చేసుకున్నదని గుర్తుచేశారు. అనంతరం తాము చెల్లించిన రూ. 64 కోట్ల ప్రీమియాన్ని ప్రభుత్వం తిరిగి ఇవ్వకపోవడంతో మోసర్‌బేర్ హైకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. దీంతో వడ్డీ సహా చెల్లించాలని 2023 జనవరిలో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందని వివరించారు. అయినప్పటికీ డబ్బులు చెల్లించకపోవడంతో ఢిల్లీలోని హిమాచల్ భవన్‌ను వేలం వేసి ఆ డబ్బును కంపెనీకి చెల్లించాలని 2024లో హైకోర్టు ఆదేశించిన విషయాన్ని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి

ఏడు నెలలకుపైగా మంచు కురిసే ప్రాంతంలో రూ. 6,200 కోట్ల ప్రాథమిక అంచనాతో 510 మెగావాట్ల హైడల్ పవర్ ప్రాజెక్టు కట్టేందుకు రేవంత్ ప్రభుత్వం ఎందుకు ఆసక్తి చూపుతున్నదని ప్రశ్నించిన హరీశ్‌రావు.. దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని విద్యుత్తుశాఖ మంత్రి భట్టివిక్రమార్కను డిమాండ్ చేశారు. ఫీజిబిలిటీ రిపోర్టు, డీపీఆర్ లేకున్నా, జెన్‌కో బోర్డు ఆమోదం లభించకున్నా ఎంవోయూ చేసుకొని రూ. 26 కోట్ల ఎందుకు చెల్లించారో తెలంగాణ ప్రజలకు చెప్పాలని, ఈ విషయాన్ని అసెంబ్లీలో కూడా చర్చించాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాల గూడుపుఠాణి!

హైడల్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లోని రెండు కాంగ్రెస్ ప్రభుత్వాల మధ్య జరుగుతున్న గూడుపుటాణీని బయటపెట్టాలని, ఈ విషయాన్ని గల్లీ కాంగ్రెస్ చెప్తుందా? ఢిల్లీ కాంగ్రెస్ చెప్తుందా? హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ చెప్తుందా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

ఇచ్చిన హామీలకు డబ్బుల్లేవు.. కానీ..

రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు, మహాలక్ష్మి, తులం బంగారం, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా భరోసా, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, ఉద్యోగుల డీఏలకు, చివరికి పీఆర్సీ అమలుకు డబ్బులు లేవని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, హిమాచల్ ప్రదేశ్‌లో వదిలేసిన ప్రాజెక్టుకు రూ. 6,200 కోట్లు ఎక్కడిని నుంచి వస్తాయో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

తెలంగాణ మెడపై బనకచర్ల కత్తి

> మొదటిపేజీ తరువాయి...

ప్రయోజనాలను కాపాడుతుందా? అని సాగునీటిరంగ నిపుణులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. నాడు పోతిరెడ్డిపాడు... నేడు కావేరి వయా బనకచర్ల... కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు శాశ్వతంగా విఘాతాన్ని కలిగించనున్నాయని ఆందోళన చెందుతున్నారు.

గోదావరి-కావేరి లింక్‌పై కేంద్రం పరుగులు

గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుపై కేంద్రం పరుగులు పెడుతున్నది. పార్లమెంటు ఎన్నికల ముందు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను పంపించి నెల రోజుల్లో అభిప్రాయాలు చెప్పండి... లేకపోతే సమ్మతిగానే భావిస్తామని పేర్కొన్న మోదీ ప్రభుత్వం.. రాజకీయ సమతూకంలో భాగంగా కత్తిని కాస్త పక్కకుపెట్టింది. కానీ, వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు... ఒకవైపు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత జలాల వినియోగానికే వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటం, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సర్కారు కొలువుదీరడంతో తెలంగాణపై జల యుద్ధాన్ని ప్రకటించినట్టుగా తెలుస్తున్నది. వాస్తవానికి గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుపై ఎన్‌డబ్ల్యూడీఏ గత నెలలోనే సమావేశాన్ని నిర్వహించాలని తలపెట్టినప్పటికీ, దానిని వాయిదా వేశారు. ఈలోగా చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేసుకొని ఢిల్లీకి వెళ్లి మరీ కేంద్రానికి సమర్పించారు. అటు పిమ్మట అక్కడే అధికారికంగా బనకచర్ల ప్రాజెక్టు గుట్టును సవివరంగా మీడియా ముందు ఉంచారు. ఇది జరిగిన కొన్నిరోజులకే తాజాగా కేంద్రం రంగంలోకి దిగింది. వచ్చే నెల 24న అనుసంధాన ప్రాజెక్టుపై సమావేశాన్ని ఖరారు చేసింది. ఈ మేరకు కేంద్ర జల సంఘం, నదుల అనుసంధాన ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ అతుల్‌కుమార్‌జైన్ తెలంగాణ, ఏపీ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం అందించారు. జలసౌధలో ఉదయం 11.30 గంటలకు జరగనున్న సమావేశంలో అనుసంధాన ప్రాజెక్టుపై అభిప్రాయాలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు.

ఇన్‌టేక్ పాయింట్‌పై దాగుడుమూతలు

- గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా గోదావరి జలాలను ఎక్కడినుంచి మళ్లించనున్నారనే దానిపై ఇప్పటిదాకా ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టత ఇవ్వడం లేదు.
- గతంలో డీపీఆర్ పంపినప్పుడు ఇచ్చంపల్లి నుంచి తరలించనున్నట్టు పేర్కొన్నారు. కానీ, ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించాలంటే ఎగువన మేడిగడ్డ పూర్తిగా మునిగిపోతుంది. దిగువన ఉన్న సమ్మక్క-సారక్క (తుపాకులగూడెం) బరాజ్ వల్ల ఇచ్చంపల్లి వద్ద నిర్మించే బరాజ్‌కు ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరించారు. పైగా ఇచ్చంపల్లి వద్ద బరాజ్‌తో ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎత్తున ముంపు సమస్య ఏర్పడుతుంది. దీంతో ఇందుకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఏపీ రాష్ట్రాల పూర్తిస్థాయి సమ్మతులు కావాల్సి ఉంటుంది. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వమే ఉన్నందున మోదీ సర్కారు వారిని ఇబ్బంది పెట్టే అవకాశాలు చాలా తక్కువ. అందుకే ఈ పాయింట్‌ను పక్కకు పెట్టినట్టు తెలిసింది.
- గతంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సమ్మక్క-సారక్క బరాజ్‌లోనే నీటి నిల్వను పెంచి అక్కడినుంచి గోదావరి జలాలను తరలించుకుపోతారనే ప్రతిపాదన కూడా ఉన్నది. ఆ బరాజ్ ప్రస్తుత ఎఫ్ఆర్ఎల్ 83 మీటర్లు. దాని ఎత్తు పెంచి 83 మీటర్ల ఎగువన ఉన్న నీటిని తరలించుకుపోతామని గతంలో ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించినట్టు తెలిసింది. కానీ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 81 మీటర్ల ముంపునకే అంగీకరించడం లేదు. దీంతో కేంద్రం ఇక్కడ కూడా ముందుకు పోయే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ ప్రతిపాదనను కేంద్రం వినిపించినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం పలు షరతులు విధించింది. గోదావరిలో శాస్త్రీయంగా మిగులు జలాల లెక్క తేల్చి... ఒకవేళ ఉన్నట్టయితే కావేరికి తరలించే నీటిలో 50% జలాలను తెలంగాణకు వాటాగా ఇచ్చి, ఆ సామర్థ్యంతో రిజర్వాయర్లు నిర్మించి ఇవ్వాలనే తదితర డిమాండ్స్ పెట్టింది. ఇందుకు కేంద్రం ససేమిరా అన్నది.

రేవంత్ సర్కారు నిలువరించగలదా?

ఇక మిగిలిందల్లా... పోలవరం. పైగా ఇది పాత ప్రతిపాదన. ఆంధ్రప్రదేశ్ భూభాగంలో నుంచే తరలించి, తమిళనాడులోకి తీసుకుపోవచ్చు. కానీ, ఇక్కడినుంచి తరలించేందుకు కూడా అంతర్జాతీయ జల ఒప్పందాల ప్రమాణాలు, దేశంలో అమల్లో ఉన్న ట్రిబ్యునళ్లు, చట్టాలు.. ఇలా ఎలా చూసినా ఎగువ రాష్ట్రాల పూర్తిస్థాయి సమ్మతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, మోదీ ప్రభుత్వం ఇవన్నీ అమలుచేసి ముందుకుపోతుందనే దానిపై సాగునీటి రంగ నిపుణులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కారు గత రెండేండ్లుగా మేడిగడ్డను ఎండబెట్టి ప్రాణహిత జలాల వినియోగాన్నే అటకెక్కించింది. దీంతోపాటు గత కొన్నిరోజులుగా బనకచర్ల రూపంలో కావేరి కత్తి దూసుకువస్తున్నదనే సంకేతాలు కనిపిస్తున్నా ప్రభుత్వ పెద్దలు ఎవరూ నోరెత్తడం లేదు. కనీసం అభ్యంతరం వ్యక్తంచేసేందుకు కూడా కార్యాచరణ రూపొందించుకోవడం లేదు. దీంతో వచ్చే నెల జరగనున్న సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు కొన్ని అంశాలతో అభ్యంతరాలను వ్యక్తంచేయడం మినహా ప్రభుత్వం నుంచి ఎదురుదాడి పెద్దగా ఉండకపోవచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీంతో పోలవరం నుంచైతే కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని ఆంధ్రప్రదేశ్‌ను కలుపుకొనిపోతే సరిపోతుందనే యోచనలో మోదీ సర్కారు ఉన్నదనే సమాచారం అందుతున్నది. ఇందులో భాగంగానే చంద్రబాబు.. బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చి, రూ.80వేల కోట్లతో డీపీఆర్ రూపొందించి కేంద్రానికి సమర్పించినట్టు తెలిసింది. అందుకే, చంద్రబాబు సముద్రంలో కలిసే వృథా జలాల్లో 200 టీఎంసీలు వాడుకుంటామనే ప్రవచనాలు వల్లిస్తున్నారని అర్థమవుతున్నది. ఇలా ఏపీ 200 టీఎంసీలు, కావేరికి మరో 150 టీఎంసీల వరకు తరలించుకుపోతే 350-400 టీఎంసీల ప్రాణహిత జలాలకు ముప్పు పొంచి ఉందనేది సుస్పష్టం.

తెలంగాణ నోట్లో మట్టే..!

వచ్చే నెల 24న జరగనున్న సమావేశానికి ఆరు రాష్ట్రాలు హాజరు కానున్నప్పటికీ, అందులో శాశ్వతంగా నష్టపోయేది తెలంగాణనే. ఒడిశా పోలవరంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నందున తెలంగాణకు ఆ రాష్ట్రం తోడయ్యే అవకాశం ఉన్నది. కానీ, మిగిలిన వాటిలో కర్ణాటక.. ఉపనది మంజీరా ఉన్నందున పాల్గొంటున్నదే తప్ప ఈ ప్రాజెక్టుతో ఆ రాష్ట్రానికి లాభమూ లేదు.. నష్టమూ లేదు. ఛత్తీస్‌గఢ్ పోలవరం కాకుండా ఎగువన బరాజ్ నిర్మించి, ముంపు ఉన్నట్టయితేనే వ్యతిరేకిస్తుంది తప్ప పోలవరం నుంచి తీసుకుపోతే పెద్దగా అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశాలు లేవు. ఆంధ్రప్రదేశ్ బనకచర్ల ప్రయోజనం దృష్ట్యా సహకారాన్ని అందిస్తుంది. అంతిమ లబ్ధిదారు తమిళనాడు. అందుకే తెలంగాణ-ఒడిశా ఎన్ని అభ్యంతరాలు వ్యక్తంచేసినా పోలవరం ఎఫ్ఆర్ఎల్‌ను పెంచి మరీ ముందుకుపోతున్న కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుపై అభ్యంతరాల్ని పట్టించుకుంటాయా? అనే సందేహాలున్నాయి. ఈ నేపథ్యంలో అనుసంధాన ప్రాజెక్టు ఆచరణలోకి రాగానే అందులో అంతర్భాగంగానే బనకచర్ల చేపట్టనున్నారనేది మోదీ-చంద్రబాబు ద్వయం కదుపుతున్న పావులను చూస్తే అర్థమవుతుంది. దేశ ప్రయోజనాలు... అనే కోణంలో ఈ రెండు జాతీయ ప్రాజెక్టులను చేపట్టి... వెంటనే గోదావరి ట్రిబ్యునల్ ప్రకటిస్తే.. ఇక గోదావరి జలాల్లోనూ తెలంగాణ నోట్లో మట్టేనని సాగునీటిరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే నీలి విప్లవం

- మత్స్యకారులకు కేసీఆర్ పాలన కాలంలో పెద్ద పీటవేశారు
- ఏడాదికి రూ.100 కోట్లు ఇచ్చారు
- ఈ సర్కారు ఇచ్చింది రూ.20 కోట్లే
- తెలంగాణ ముదిరాజ్ మహాసభ నేత గుర్రాల మల్లేశ